# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. అమరావతిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా సంస్థల కార్యాలయాలకు శంకుస్థాపన చేసిన కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.**

**2. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశం కానున్న రాష్ట్ర మంత్రివర్గం.**

**3. హెచ్ఐవీ వ్యాధి గురించి అపోహలను తొలగించడంతో పాటు, బాధితులను ఆదరించాల్సిన అవసరం ఉందన్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్**

**4. గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం – ఇఫీ 2025 ఈరోజుతో ముగుస్తుంది.**

**5. ఈనెల 30వ తేదీన ప్రసారం కానున్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” కార్యక్రమం.**

=========================

అమరావతిలో ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రోజు శంఖుస్థాపన చేశారు. రాజధాని లోని సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ కార్యకమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రాష్ట్ర మంత్రులుతో పాటు పలువురు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

అనంతరం నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, రాజధాని అమరావతి అంటే గుర్తుకు వచ్చేది రైతులని, వారికి రుణాలను ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలని కోరారు.

వాయిస్ 30 సెకన్లు

అంతకు ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాజధాని నిర్మాణం వేగంగా జరుగుతోందని 2028 నాటికి రాజధానిలో నిర్మాణాలను పూర్తి చేసేలా పనులు జరుగుతున్నాయని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 35 సెకన్లు

-------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రివర్గం ఈ రోజు సమావేశం కానుంది. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు మధ్యాహ్నం జరిగనున్న ఈ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో పాటు రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నారు. రాష్ట్రంలో 3 నూతన జిల్లాలు, 5 రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుపై మంత్రివర్గంలో ప్రధానంగా చర్చ జరగనుందని, జిల్లాలపై మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సులను ఆమోదించే అవకాశముందని అధికారులు తెలిపారు.

-------------------------

హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడంతో, పాటు బాధితులను ఆదరించాల్సిన అవసరం ఉందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధితులతో విజయవాడలో నిర్వహించిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో మంత్రి ఈ రోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎయిడ్స్ బాధితులు కూడా సమాజంలో భాగమేనని, వారికి అండగా నిలబడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. హెచ్ఐవీ బాధితుల పట్ల ఎలాంటి వివక్ష చూపకూడదనే అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో అవగాహన పెంచడమే కాకుండా, బాధితుల గౌరవం కాపాడేందుకు సహకరిస్తాయని తెలిపారు.

-------------------------

కృష్ణానదికి 2028లో రానున్న పుష్కరాలకు అనుగుణంగా విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ అన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో అభివృద్ధి పనులను ఆలయ కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ తో కలిసి ఈ రోజు ఆయన పరిశీలించారు. అనంతరం శివనాథ్ మాట్లాడుతూ,

వాయిస్ 24 సెకన్లు

-------------------------

గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం - ఇఫీ 2025 ఈరోజుతో ముగియనుంది. ఈ నెల 20న ప్రారంభమైన ఈ ఉత్సవంలో 81 దేశాల నుండి 240కి పైగా చిత్రాలు ప్రదర్శితమైయ్యాయి. శేఖర్ కపూర్, రాజ్ కుమార్ హిరానీ, అమీర్ ఖాన్, రమేష్ సిప్పీ, ముజఫర్ అలీ, అక్కినేని నాగార్జున వంటి చలన చిత్ర పరిశ్రమ నిపుణులతో పలు అంశాలపై అనేక మాస్టర్ క్లాస్ లను నిర్వహించారు. గురుదత్, రాజ్ ఖోస్లా, రిత్విక్ ఘటక్ , నందమూరి బాలకృష్ణ వంటి సినిమా దిగ్గజాలను సత్కరించారు. పణాజీలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో ఇఫీ ముగింపు వేడుక జరుగుతుంది. ఈ ముగింపు వేడుకలో భాగంగా చలనచిత్ర రంగంలో 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తమిళ నటులు రజనీకాంత్ ను సత్కరించడంతో పాటు, చలన చిత్రాలకు సంబంధించిన గోల్డెన్ పీకాక్, సిల్వర్ పీకాక్ పురస్కారాలను ప్రదానం చేస్తారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో క్యాన్సర్‌కు మెరుగైన వైద్య సేవలను

అందించేందుకు లీనియర్ యాక్సిలరేటర్ పరికరాన్ని ఏర్పాటు చేయనున్నామని ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జి మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులతో నిన్న సమావేశమైన మంత్రి విజయవాడ ప్రభుత్వాసుపత్రి అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించి, ఉన్నత వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. క్యాన్సర్ కణాలను తొలగించేందుకు ఉపయోగించే లీనియర్ యాక్సిలరేటర్ పరికరం ఏర్పాటుకు కావాల్సిన ప్రక్రియను పూర్తి చేయనున్నామని మంత్రి వివరించారు..

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన కార్మిక చట్టాలపై శ్రీకాకుళం జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 29 చట్టాల స్థానంలో తీసుకువచ్చిన నాలుగు కొత్త లేబర్ కోడ్ లు కార్మికులతో పాటు పారిశ్రామిక అభివృద్ధికి మరింత దోహదపతాయని శ్రీకాకుళం జిల్లాకి చెందిన వ్యాపారవేత్త పీజీ గుప్తా ఆకాశవాణికి తెలియజేస్తూ,

వాయిస్ 26 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈ రోజు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

నైరుతి బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న శ్రీలంక తీరంలో తీవ్ర వాయుగుండం తుపానుగా మారిందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ తుఫానుకు 'దిత్వాహ్'గా నామకరణం చేసినట్టు అధికారులు తెలిపారు. ఉత్తర తమిళనాడు-పుదుచ్చేరికి ఆనుకుని ఉన్న దక్షిణ కోస్తా తీరం వైపు తుఫాను కదులుతోందని ఆదివారం తెల్లవారుజామున తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణకోస్తా తీరాలకు చేరే అవకాశముందని తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో పలు జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి కరుణాసాగర్ తెలియజేసారు.

====================